## క్లుప్తంగా

### ప్రమాణ స్వీకారానికి హాజరు కావాలి

**పర్వతగిరి :** కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలిగా ఎన్నికైన ఎర్రబెల్లి స్వర్ణ ప్రమాణ స్వీకారం ఈనెల 31న వరంగల్‌లోని అబ్బాస్ ఫంక్షన్ హాలులో జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రమాణ స్వీకారానికి గ్రామ పార్టీ అధ్యక్షులు, మండల ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు భాస్కర్, నరుకుడు రవీందర్, బొట్ల వెంకట సంతోష్, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

### సన్మానం

**పర్వతగిరి :** గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఏఎంసీ డైరెక్టర్ పట్టాపురం ఏకాంతంగౌడ్‌ను బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రంగు కుమార్‌గౌడ్, మాజీ ఎంపీపీ, గ్రంథాలయ డైరెక్టర్ రంగు రజిత సోమవారం శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో దొనికన మహేష్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

### పరామర్శ

**వర్ధన్నపేట :** మండలంలోని రామవరం ఎంపీటీసీ చిలుముల సోమయ్య భార్య సోమలక్ష్మి అనారోగ్యంతో బాధపడుతూ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అరూరి రమేష్ సోమవారం సోమలక్ష్మిని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ అప్పారావు, జెడ్పీటీసీ భిక్షపతి, మండల అధ్యక్షుడు కుమారస్వామి, సర్పంచ్ వెంకట్‌రెడ్డి, నాయకులు కుమారస్వామి, యాకయ్య ఉన్నారు.

### నైపుణ్యం పెంచుకోవాలి



**నడికూడ :** నైపుణ్యం పెంచుకుంటేనే ఆర్థికాభివృద్ధి సాధించగలరని ఎంపీపీ మచ్చ అనసూర్య తెలిపారు. మండలం కేంద్రంలో నాబార్డ్ సహకారంతో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళలకు జీవనోపాధి, వ్యాపార సంస్థల అభివృద్ధి, ఫుడ్ ప్రాసెసింగ్‌పై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని జెడ్పీటీసీ కోడెపాక సుమలతతో కలిసి ఎంపీపీ సోమవారం సందర్శించి పరిశీలించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడారు. ఆహార పదార్థాల తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్‌లో నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు. ఏపీఎం రమాదేవి మాట్లాడుతూ ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు కోసం ఐకేపీ ద్వారా మహిళలకు రుణాలు ఇప్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఫుడ్ ప్రాసెసింగ్ ట్రెయినర్ షరీఫా, సర్వోదయ ఆర్గనైజేషన్ ప్రతినిధులు చాపర్తి రవీందర్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థికసాయం



**నడికూడ :** మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామానికి చెందిన నార్ల లక్ష్మీనారాయణ ఇటీవల మృతి చెందగా కాంగ్రెస్ పార్టీ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రాంరెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ నాయకులు బాధిత కుటుంబానికి ఇనగాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు బందెల దామోదర్, మహ్మద్ రంజాన్, బొట్ల అనిల్, బొట్ల సురేందర్, వార్డ్ సభ్యుడు బందెల రామస్వామి పాల్గొన్నారు.

### క్విజ్ పోటీలను యువత వినియోగించుకోవాలి

**పరకాల :** రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలను యువత వినియోగించుకోవాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ కోరారు. ఆ పార్టీ పరకాల నియోజవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రాంరెడ్డి సూచనలతో పట్టణంలోని యువకులతో కలిసి వాల్ పోస్టర్లను సోమవారం శ్రీనివాస్ ఆవిష్కరించి మాట్లాడారు. పోటీలో 16 నుంచి 35 ఏళ్ల వయస్సున్న యువత అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగిన యువకులు సెల్ నంబర్ 7661899899కు మిస్డ్ కాల్ ఇవ్వాలని సూచించారు. అనంతరం మెసేజ్ ద్వారా లింక్‌ను ఓపెన్ చేసి అప్లికేషన్ నింపాలని తెలిపారు. అనంతరం రెఫరెన్స్ ఐడీ నంబర్-25501 నమోదు చేయాలని చెప్పారు. ఆన్‌లైన్ ఎగ్జామ్‌లో సమర్థత చాటిన వారికి బహుమతులు (ల్యాప్‌ట్యాప్, స్మార్ట్ ఫోన్, ట్యాబ్, తదితర ప్రోత్సాహకాలు) అందజేస్తారని వివరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకుడు బొచ్చు చందర్, పట్టణ ప్రధాన కార్యదర్శులు చందుపట్ల రాజిరెడ్డి, పబ్బ శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ అలీ, పోరండ్ల వేణు, బొచ్చు కట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# మట్టి రోడ్డుకు మోక్షమెప్పుడో?

- గుంతలమయంగా ఇటుకాలపల్లి–దబ్బీర్‌పేట రోడ్డు
- ప్రయాణికులు, రైతులకు తప్పని నరకం
- పట్టించుకోని అధికారులు, పాలకులు



గుంతలమయంగా మారిన ఇటుకాలపల్లి- దబ్బీర్‌పేట రోడ్డు

**నర్సంపేట రూరల్ :** ఇటుకాలపల్లి గ్రామం నుంచి దబ్బీర్‌పేటకు వెళ్లే మట్టిరోడ్డు పూర్తిగా గుంతలమయం కావడంతో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మట్టిరోడ్డు స్థానంలో బీటీరోడ్డు నిర్మించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికి మంజూరు చేసిన దాఖలాలు లేవు.. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బీటీ రోడ్డు వేయించాలని పలువురు రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు. నర్సంపేట మండలంలోని ఇటుకాలపల్లికి సంబంధించిన 80శాతం వరకు వ్యవసాయ భూములు మొత్తం ఖానాపురం మండలంలోని దబ్బీర్‌పేట గ్రామ శివారులోనే ఉన్నాయి. దీంతో రైతులు, ప్రజలు వ్యవసాయ పనుల నిమిత్తం నిత్యం దబ్బీర్‌పేట వైపు వెళ్తుంటారు. ఇటుకాలపల్లి–దబ్బీర్‌పేట వరకు సుమారు ఆరు కిలోమీటర్ల మట్టిరోడ్డు ఉంటుంది. ఈరోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారింది. కాగా ఈ రోడ్డుగుండా వెళ్లాలంటే వాహదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే రోడ్డు ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. గుంతలమయమైన రోడ్డు గుండా వెళ్లలేని వాహదారులను ఆకులతండా క్రాస్ రోడ్డు, ఇప్పల్‌తండా, ఏనుగల్‌తండా మీదుగా వెళ్లాల్సి వస్తోంది. దీంతో అదనంగా మరో పది కిలోమీటర్ల దూరం వస్తోంది. ఈ రోడ్డును మంజూరు చేయించి నూతన రోడ్డు వేయాలని పలుమార్లు అధికారులకు అర్జీలు పెట్టిన పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఈ విషయంపై సీపీఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టిన ఉన్నతాధికారులకు సైతం నివేదించారు. అధికారులు స్పందించి రోడ్డును తక్షణమే నిర్మించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

### రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే హామీ..



ఇటుకాలపల్లి–దబ్బీర్‌పేట రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారిందని, ఈ రోడ్డు గుండా నిత్యం ప్రజలు, రైతులు వెళ్తూ వస్తున్నారు. ఇటీవల ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఐటీడీఏ నిధులతో మంజూరు చేయించేందుకు ప్రతిప్రాదనలకు కృషి చేస్తానన్నారు. త్వరలోనే పనులను ప్రారంభమయ్యేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.రోడ్డు నిర్మాణంతో స్థానిక ప్రజలకు ఇబ్బందులు తగ్గుతాయి.

-మండల రవీందర్, సర్పంచ్ ఇటుకాలపల్లి

# బ్యాంక్ సేవలు అందుబాటులోకి తెస్తాం..

- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తదితరులు

**నల్లబెల్లి :** జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ సేవలను మండల ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. నాబార్డు సహకారంతో నల్లబెల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో రూ.31.60 లక్షల నిధులతో నిర్మిస్తున్న నూతన భవనాన్ని పీఏసీఎస్ అధ్యక్షుడు చెట్టుపల్లి మురళీధర్‌తో కలిసి ఎమ్మెల్యే సోమవారం సందర్శించారు. నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. నల్లబెల్లి మండలానికి మంజూరైన జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ బ్రాంచ్ ప్రారంభోత్సవానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయన వెంట నర్సంపేట పీఏసీఎస్ చైర్మన్ మోరాల మోహన్ రెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఊడుగుల ప్రవీణ్ గౌడ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు నానబోయిన రాజారాం, సీఈఓ నాగెల్లి మొగిలి తదితరులు పాల్గొన్నారు.

### చర్య తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

**పర్వతగిరి :** మైనర్లకు మద్యం విక్రయించిన మండలంలోని ఏనుగల్ గ్రామంలోని శ్రీలక్ష్మీనర్సింహ వైన్స్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ మండల అధ్యక్షుడు గారె జయరాజ్, ప్రధాన కార్యదర్శి జెరిపోతుల వంశీకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు వర్ధన్నపేట ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఎన్‌హెచ్‌ఆర్‌సీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మైనర్లకు మద్యం విక్రయించడాన్ని తీవ్రంగా పరిగణించాలని, మండలంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# బాల్యవివాహాలను ప్రోత్సహించొద్దు



అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

**సంగెం :** బాల్యవివాహాలను ప్రోత్సహిస్తే చట్టప్రకారం వధూవరుల తల్లిదండ్రులతో పాటు వివాహం జరిపించిన పురోహితుడు, ఇతర బంధువులపై చట్ట ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తారని తరుణి స్వచ్ఛంధ సంస్థ మండల కో ఆర్డినేటర్ రణధీర్ తెలిపారు. ఆదివారం రాత్రి మండలంలోని పోచమ్మ తండాలో బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై లంబాడ భాషలో కళాజాతా బృందం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు, భ్రూణహత్యలు, బాలకార్మికులు, బాలికలపై లైంగిక వేధింపులు అరికట్టడం పై గిరిజనులను చైతన్య పరిచారు. కార్యక్రమంలో సర్పంచ్ గుగులోత్ రమాదేవి, ఉప సర్పంచ్ బానోత్ సారమ్మ, వరంగల్ పీడబ్ల్యూసీ మెంబర్ మధు, సిబ్బంది మౌనిక, జ్యోతి, అంజలి, భవాని, రమ్య, సుకన్య, ప్రియాంక, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# ‘ఆదర్శ’లో అడ్మిషన్లు ప్రారంభం

**పర్వతగిరి :** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో 6, 7, 8, 9, 10 తరగతులలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపాల్ పీవీవీ.గణేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయకపోయిన నేరుగా పాఠశాలకు వచ్చి టీసీ, స్టడీ సర్టిఫికెట్‌తో అడ్మిషన్ పొందగలరని అన్నారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో అడ్మిషన్ కోసం ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడానికి మే 30వ తేదీ వరకు ఉందన్నారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థులు పాఠశాలకు వస్తే ఆన్‌లైన్‌లో ఉచితంగా అప్లై చేస్తారని తెలిపారు.

# అనుమతి లేకుండా బస్టాండ్ కూల్చివేత



కూల్చిన ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం

**చెన్నారావుపేట :** అనుమతి లేకుండా ఆర్టీసీ బస్టాండ్‌ను కూల్చివేసిన ఘటన సోమవారం చెన్నారావుపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఇటీవల మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పనులు వేగంగా సాగుతున్నాయి. అందులో భాగంగా గ్రామపంచాయతీ ఎదురుగా ఉన్న బస్టాండ్ ప్రాంగణాన్ని నేలకూల్చారు. ఈ ప్రాంగణం సుమారుగా 70సంవత్సరాల క్రితం నిర్మించారు. ఎంతో మంది ప్రయాణికులకు ఆశ్రయంగా నిలిచింది. అంతే కాకుండా బోసిపోయిన బస్టాండ్ ప్రాంగణాన్ని ఇటీవల హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుందరంగా తీర్చిదిద్దారు. అలాంటి ప్రాంగణం నేలకూడంతో మండల కేంద్రంలో బోసిపోయి కన్పిస్తోంది. దీనిపై డిపో మేనేజర్ విజయామాధూరి, ఏఓ రాజబాబులు మాట్లాడారు. చెన్నారావుపేటలోని బస్టాండ్‌ను కూల్చివేయడం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. అభివృద్ధిలో భాగంగా తప్పని పరిస్థితి అయినా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కూల్చడం సరికాదన్నారు. ఈ విషయంపై రెవెన్యూ, పోలీసు, గ్రామ పంచాయతీ అధికారులు, కాంట్రాక్టర్‌ను అడిగిన ఎలాంటి సమాచారం రాలేదన్నారు.

# ఆటో కార్మికుల అభివృద్ధే ధ్యేయం

- ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్

**కాజీపేట రూరల్ :** ఆటో కార్మికుల అభివృద్ధి, సంక్షేమమే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కాజీపేట జంక్షన్‌లోని ప్రతాపరుద్ర ఆటో యూనియన్ ఆటో స్టాండ్ వద్ద సోమవారం ఆర్ట్స్ కాలేజ్ ఆడిటోరియం ఆవరణంలో ఈ నెల 31వ తేదీన జరిగే కార్మిక యుద్ధభేరి బహిరంగ సభ కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఆటో కార్మిక కుటుంబాల సంక్షేమానికి కట్టుబడి ఉందని, కార్మికుల పిల్లలు ఉన్నత చదువులు చదివేందుకు ప్రభుత్వ రెసిడెన్సీ పాఠశాలలు నిర్మించిందన్నారు. నగరంలో ఆటో కార్మికుల కోసం ఆటో కార్మికుల ఆత్మీయ భవన్ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆటో కార్మికుల సహకార సంఘం బలోపేతానికి మరింత కృషి చేస్తానన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజలు, కార్మికుల అభివృద్ధికి కృషి చేస్తుంటే కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తుందని ఆరోపించారు. విభజన చట్టంలో చెప్పిన విధంగా కాజీపేట జంక్షన్‌కు డివిజన్ హోదా కల్పించాలని, కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతాపరుద్ర ఆటో యూనియన్ ప్రెసిడెంట్ గద్దం నర హరి, ప్రధాన కార్యదర్శి నాతి సత్యనారయణ, కోశాధికారి భూక్యా శంకర్‌నాయక్, బొక్క స్వామి, ఎండి.నజీర్, పాలడుగుల రవి, సుధాకర్, కార్పొరేటర్ సంకు నర్సింగరావు, బీఆర్ఎస్ నాయకులు రావుల సదానందం. సుంచు కృష్ణ, బొట్టు రాజు, దువ్వ కనకరాజు, ఎస్‌డి.సర్వర్, కాటపురాజు, డ్రైవర్లు పాల్గొన్నారు.

# పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి



వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

**చెన్నారావుపేట :** ప్రభుత్వ భూములను కాపాడి పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఎం మండల కార్యదర్శి నమిండ్ల స్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ బన్సిలాల్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని లింగగిరి గ్రామంలో సర్వే నంబర్ 289లో 69 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండాలని, కొందరు వ్యక్తులు దానిని అక్రమంగా ఆక్రమించారని అన్నారు. అధికారులు వారిపై చర్యలు తీసుకుని అసైన్డ్ పట్టా చేసుకున్న వాటిని రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ భూమిని నీడలేని పేదలకు పంచాలన్నారు. లేనిచో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు శారద, స్థానికులు, మహిళలు, తదితరులు ఉన్నారు.

# దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరూరి రమేష్

**ఐనవోలు :** దశాబ్ది ఉత్సవాలను పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించాలని ప్రజా ప్రతినిధులు, నాయకులు, అన్ని శాఖల అధికారులకు ఎమ్మెల్యే అరూరి రమేష్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే మండల నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి పదేళ్ల పూర్తైన సందర్భంగా ప్రభుత్వం 21రోజుల పాటు దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తుందన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గ వ్యాప్తంగా దశాబ్ది ఉత్సవాల కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి అధికారులు, ప్రజా ప్రతినిధులకు దిశానిర్దేశం చేయడానికి మంగళవారం హంటర్‌రోడ్డులోని విష్ణుప్రియ గార్డెన్‌లో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటలకు అందరు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**మండల రైతుబంధు కన్వీనర్‌గా మునిగాల సంపత్‌కుమార్**

మండల రైతుబంధు కన్వీనర్‌గా ఆలయ మాజీ చైర్మన్ మునిగాల సంపత్ కుమార్‌కు అవకాశం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే అరూరి రమేష్ ప్రకటించారు. తనపై నమ్మకం ఉంచి మరోసారి బాధ్యతాయుతమైన పదవిని అప్పగించినందుకు ఎమ్మెల్యేకు సంపత్ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, ఎంపీపీ మార్నేని మధుమతి, మండల పార్టీ అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి, బుర్ర రాజశేఖర్, సర్పంచ్ జన్ను కుమారస్వామి, మండల నాయకులు ఆడెపు దయాకర్, సింగారపు రాజు, భైరి వెంకటయ్య, తండ వెంకన్న, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకోవాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీపీ, అధికారులు

**ఖానాపురం :** రైస్ మిల్లులకు వచ్చే ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేయించుకోవాలని తహసీల్దార్ జూలూరి సుభాషిణి, ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్ రావు సూచించారు. ఈ మేరకు మండల కేంద్రంలోని శ్రీనివాస రైస్ మిల్‌ను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దిగుమతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిల్లులో నిల్వలు ఎక్కువైతే ధాన్యం నిల్వ చేసుకోవడానికి స్థలం ఎలా విషయాలపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ మిల్లుల్లో హమాలీల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందన్నారు. తనిఖీలో ఎస్సై తిరుపతి, సొసైటీ సీఈఓ అంజనేయులు, భూస అశోక్‌యాదవ్, బంధారపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

**ఉత్సవాలను విజయవంతం చేయాలి**

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు సూచించారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో ఉత్సవాల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూన్ 2నుంచి 22వరకు ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతీ ఒక్కరు ఉత్సవాల్లో పాల్గొనాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ సుమణవాణి, ఎంపీఓ రవి తదితరులు పాల్గొన్నారు.

# కంఠమహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



ఖానాపురం: ఆలయానికి వెళ్తున్న గౌడ కులస్తులు



నల్లబెల్లి: ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పెద్ది



దుగ్గొండిలో..

**నల్లబెల్లి :** గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన కంఠమహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని మండలంలోని లెంకాలపల్లిలో సోమవారం వైభవంగా నిర్వహించారు. పురోహితులు బానాల సాయిశర్మ, ఎరుకొండ సమ్మయ్య శాస్త్రీలు సామూహిక హోమాలు నిర్వహించారు. ఎంపీపీ ఊడుగుల సునీతతో కలిసి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రత్యేక పూజలు చేయగా.. నూతనంగా నిర్మించిన ఆలయంలో కంఠమహేశ్వరస్వామి, రేణుక ఎల్లమ్మ, జమదగ్ని, వనం మైసమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం ఎమ్మెల్యే, ఎంపీపీలను పురోహితులు, కుల పెద్దలు సన్మానించారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ కంఠమహేశ్వరస్వామి దేవాలయం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఊడుగుల ప్రవీణ్ గౌడ్, గండె శ్రీనివాస్ గుప్తా, కొత్తపల్లి కోటిలింగాచారి, విగ్రహాల దాత ఎరుకొండ మునీశ్వర్, సర్పంచ్ మేకల లక్ష్మి, ఉప సర్పంచ్ కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, లెంకాలపల్లి గౌడ సంఘం అధ్యక్షుడు పబ్బు రవీందర్, ఉపాధ్యక్షుడు నాతి రాజుగౌడ్, గన్నెబోయిన చేరాలు, ఎరుకొండ సదానందం, గడ్డమీది రత్నాకర్, మోటపోతుల నరేష్ పాల్గొన్నారు.

**కంఠమహేశ్వరస్వామికి బోనాలు**

**ఖానాపురం :** మండలంలోని ధర్మరావుపేట గ్రామంలో గౌడ కులస్తులు ఘనంగా కంఠమహేశ్వరస్వామి(కాటమయ్య)కు బోనాలను సమర్పించారు. జలాధారణ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఊరేగింపుగా వెళ్లి గుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుమారస్వామి, మేడి సమ్మయ్య, విజయ్‌కుమార్, ఆనందం, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

**బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవం**

**నెక్కొండ :** రేపు(బుధవారం), జూన్ 1న(గురువారం) నెక్కొండ బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించడం జరుగుతుందని సర్పంచ్ సొంటిరెడ్డి యమునారెడ్డి ప్రకటనలో సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తొలి రోజు ఉదయం 5గంటల నుంచి మహాగణపతి పూజ, స్వస్తి, పుణ్యాహవాచనం, కలశ ప్రతిష్ఠాపన, వరుణ నవగ్రహ అష్టదిక్పాలక, వాస్తు పురుష, సర్వతోభద్ర మంటపారాధన, అవాహిత, ప్రతిష్ఠిత దేవతల హవానం, పూర్ణాహుతి, మధ్యాహ్నం 12నుంచి రాత్రి వరకు గ్రామ దేవత (బొడ్రాయి)కి రాగి కలశములతో జలాభిషేకం ఉంటుందన్నారు. రెండో రోజు ఉదయం 7గంటల నుంచి కలశోద్వాసన, గ్రామ దేవతలకు విశేష అభిషేకం, నివేదన, హారతి మహదాశీర్వచనం, తీర్థ పులిహోర ప్రసాద వితరణలతో ఉత్సవ సమాప్తి అవుతందని ఆమె పేర్కొన్నారు. గ్రామస్తులు, బంధువులు పాల్గొని భక్తిశ్రద్ధలతో వేడుకలను విజయవంతం చేయాలని ఆమె కోరారు.

**తిమ్మంపేటలో..**

**దుగ్గొండి :** మండలంలోని తిమ్మంపేట గ్రామంలో యోగానంద లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు కార్యక్రమంలో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రోక్షణలో భాగంగా ధ్వజస్తంభానికి గ్రామంలోని ఆడపడుచులంతా కొత్త మట్టి కుండలలో నీరు తెచ్చి శాస్త్రోక్తంగా జలాభిషేకం చేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ మోడెం విద్యాసాగర్, ఎంపీటీసీ మాలోత్ చంద్రు, ఉప సర్పంచ్ ఏకాంబరం, ఆలయ అర్చకుడు రాంకీచార్యులు, వేద పండితుల బృందం పాల్గొన్నారు.

**భక్తిశ్రద్ధలతో విగ్రహాల తరలింపు**

**రాయపర్తి :** మండలంలోని మైలారం గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు సోమవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీతారామచంద్ర, లక్ష్మణ సమేత, శ్రీ భక్తాంజనేయ, శ్రీ గణేష, వైనతేయ, శ్రీరుద్రనందీశ్వర, నవగ్రహ, పాండురంగ పునః ప్రతిష్ఠ శిలాధ్వజస్తంభ మహా ప్రతిష్ఠలో భాగంగా అంకురార్పణ కార్యక్రమం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయానికి విగ్రహాలను తరలించారు. ఈ కార్యక్రమంలో ధ్వజస్తంభ దాత బొమ్మినేని రంగారెడ్డి దంపతులు, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, సర్పంచ్ లేతాకుల సుమతియాదవరెడ్డి, ఎంపీటీసీ గాడిపెల్లి వెంకన్న, ఉపసర్పంచ్ బాద సారయ్య, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దీంతో గ్రామంలో సందడివాతావరణం నెలకొంది.

### మంత్రి దయాకర్‌రావును కలిసిన ముదిరాజ్‌లు



**రాయపర్తి :** మండలంలోని ఊకల్ గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తులు సోమవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు పెద్దమ్మ గుడి నిర్మాణానికి నిధులను మంజూరు చేయాలని కోరగా మంత్రి దయాకర్ రావు తక్షణమే స్పందించి రూ.5లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కుందూరు రామచంద్రారెడ్డి, మార్కెట్ డైరెక్టర్ యాదగిరిరెడ్డి, మాజీ ఎంపీపీ నాగపురి రాంబాబుగౌడ్, మాజీ సర్పంచ్ బొడ్డు రంగయ్య, రావుల వెంకట్‌రెడ్డి, గొల్లపల్లి సదాశ్రీను, బుర్ర రామ్మూర్తి, గౌని అఖిల్, ముదిరాజ్ కమిటీ అధ్యక్షుడు నర్సింహుల రమేష్, ప్రధాన కార్యదర్శి కొండా మహేందర్, ఉపాధ్యక్షుడు నర్రా దేవేందర్ ఉన్నారు.